# సింగరేణి భవిష్యత్ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**నూతన గనులు ప్రారంభించాలి.. బకాయిలు వెంటనే చెల్లించాలి**
**ఉప ముఖ్యమంత్రికి డా. బి. జనక్ ప్రసాద్ విజ్ఞప్తి**

**అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్) :**

సింగరేణి సంస్థ అభ్యున్నతి, కార్మికుల సంక్షేమం, భవిష్యత్ ప్రయోజనాల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి డా. బి. జనక్ ప్రసాద్ కోరారు. సోమవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘాలు, అధికారుల సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డా. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ.. సింగరేణి భవిష్యత్ అవసరాల దృష్ట్యా నూతన బొగ్గు గనులు ప్రారంభించాలని, ప్రభుత్వం, విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు సంబంధించిన ప్రత్యేక సౌకర్యాలపై ఆదాయపు పన్ను మినహాయింపు, మారుపేర్ల సమస్య పరిష్కారం, సొంత ఇంటి పథకం అమలు, 2025--26 ఆర్థిక సంవత్సర లాభాల వాటా ప్రకటించాలని కోరారు. అధికారుల పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు తదితర సమస్యలను కూడా మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై మంత్రులు సానుకూలంగా స్పందిస్తూ.. సింగరేణి యాజమాన్యంతో చర్చించి కార్మికులు, అధికారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సింగరేణి అధికారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



## 22ఏ నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి




**అగ్ని ధార న్యూస్ ,(కరీంనగర్) :**

22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన పట్టా భూములు, నివాస స్థలాలను పరిశీలించి వెంటనే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి, చింతకుంట, మల్కాపూర్ రోడ్ తదితర ప్రాంతాల్లో 22ఏ కారణంగా వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏళ్లుగా కష్టార్జితంతో స్థలాలు కొనుగోలు చేసి, చట్టబద్ధమైన పత్రాలతో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారి ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చడంతో క్రయవిక్రయాలు నిలిచిపోయాయని అన్నారు. ఇళ్ల నిర్మాణానికి రుణాలు పొందలేక ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇంటిపన్ను, విద్యుత్, నీటి బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ ఆస్తులపై హక్కులను వినియోగించుకోలేకపోతున్నారని తెలిపారు. ప్రతి సర్వే నంబరును వ్యక్తిగతంగా పరిశీలించి, బాధితుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి పారదర్శకంగా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఏళ్లుగా ఇళ్లను నిర్మించుకుని నివసిస్తున్న కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా రేకుర్తి సహా ఇతర ప్రాంతాల్లోని 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని హరిప్రసాద్ డిమాండ్ చేశారు. సమావేశంలో కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకం శివరాణి, శ్రీరాముల రమేష్, రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్, బసవేణి రాజేందర్, నూతి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు రాఖీలు కట్టిన బీజేపీ శ్రేణులు



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

రాఖీ పండుగను పురస్కరించుకుని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు ఆర్జీ-1 సింగరేణి గనుల వద్ద కార్మికులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులతో ముచ్చటించి వారి క్షేమసమాచారం, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కందుల సంధ్యారాణి మాట్లాడుతూ.. అన్నా--చెల్లెలు, అక్క--తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. కుటుంబ సభ్యుల మాదిరిగానే సింగరేణి కార్మికుల మధ్య సోదరభావం, ఐకమత్యం కొనసాగాలని ఆకాంక్షించారు. కష్టనష్టాలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి కార్మికుల సంక్షేమానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, కోడూరి రమేష్, బియ్యాల మహేందర్, పాకాల నరసింహారెడ్డి, బూడిద హర్ష, కొట్టే నరేష్, శ్రీనివాస్, చింతం అంజి, గంగరాజు, ఎల్తూరి సరిత--రాజయ్య, మీశ వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 17న నిర్వహించిన ఇంటర్వ్యూలకు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత హాజరయ్యారు. ఆగస్టు 24న నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో మొత్తం 13 మంది యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండలాల వారీగా ఎంపికైన వారు ఆమనగల్ మండలం 5 గురు, వెల్దండ మండలం --ఆరుగురు, తలకొండపల్లి మండలం ఇద్దరు, మొత్తం 13 మంది ఉద్యోగాలకు ఎంపికనట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఉద్యోగాల ద్వారా ఎంపికైన యువత కుటుంబాల్లో ఆర్థిక భరోసా కలగాలని, లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగంలో రాణిస్తూ ఉన్నత పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఐక్యత ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అర్హత కలిగిన ఉద్యోగార్థులు 9848244119 నంబర్‌ను సంప్రదించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సూచించారు.

## ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిర్లక్ష్యంపై ఢిల్లీలో కమిషన్ ఫిర్యాదు



**అగ్ని ధార న్యూస్ (న్యూఢిల్లీ) :**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, భూవివాదాల్లో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ప్రతినిధులు ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ ముక్వానాను కలిశారు. నాలుగు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా పలు ముఖ్యమైన అంశాలపై జాతీయ స్థాయి అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా 41ఏ సీఆర్‌పీసీ కింద నిందితులకు పోలీస్ స్టేషన్‌లోనే బెయిల్ ఇవ్వడం వల్ల అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరగడం లేదని కమిషన్ ప్రతినిధులు వివరించినట్లు తెలిపారు. అలాగే భూవివాదాలు, అట్రాసిటీ కేసుల దర్యాప్తులో జరుగుతున్న నిర్లక్ష్యంపై దృష్టికి తీసుకెళ్లారు. ఈ పర్యటనలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు బక్కి వెంకటయ్య, కొంకటి లక్ష్మీనారాయణ, రేణుకుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్, జిల్లా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫేజ్-2పై ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సమీక్ష



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం) :**

ఎస్ఐఆర్ ఫేజ్-2 ప్రక్రియపై రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లతో ప్రక్రియ పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

## దళితుల సమస్యలపై భారీ కార్యక్రమం చేపడతాం

**అగ్ని ధార న్యూస్ ,(మంథని) :**

దళితుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో భారీ కార్యక్రమం చేపడతామని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ హామీ ఇచ్చినట్లు మంథని డివిజన్ దళిత సేన అధ్యక్షుడు ఊట్ల శ్రీను తెలిపారు. ఈ మేరకు మంథని నియోజకవర్గానికి చెందిన దళిత నాయకులు పుట్ట మధుకర్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం దళితబంధు పథకాన్ని తీసుకొచ్చిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న 'అంబేద్కర్ అభయహస్తం' పథకం కింద దళితులకు రూ.12 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదని ఆరోపించారు. దళితుల్లోని 59 కులాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయహస్తం పథకం అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చేలా పుట్ట మధుకర్ చొరవ తీసుకోవాలని నాయకులు కోరారు. సమస్యపై మాట్లాడితేనే మంథని ప్రాంతంలో పనులు జరుగుతున్నాయని, దళితుల తరఫున ఉద్యమానికి నాయకత్వం వహించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పుట్ట మధుకర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే దళితుల పక్షాన భారీ కార్యక్రమం చేపడతామని తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా దళిత సేన అధ్యక్షుడు నవుండ్ల సంపత్ మహారాజ్, ఉపాధ్యక్షుడు జక్కన్న, మంథని డివిజన్ దళిత సేన ప్రధాన కార్యదర్శి ఆర్ల స్వామి, భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రామన్న, పలువురు సీనియర్ దళిత నాయకులు పాల్గొన్నారు.

## మంథనిలో ప్రజావాణి కి 8 దరఖాస్తులు

**అగ్నిధార న్యూస్ మంథని :**




మంథని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల నుంచి పలు సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. శాఖల వారీగా ఇందిరమ్మ ఇళ్లకు 3, రెవెన్యూ శాఖకు 3, విద్యుత్ శాఖకు 1, పంచాయతీరాజ్ శాఖకు 1 చొప్పున మొత్తం 8 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో శ్రీజ రెడ్డి మంథని ఎంపీడీవో కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ




**రామగుండం నియోజకవర్గంలో కొనసాగుతున్న సంక్షేమ కార్యక్రమాలు**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ మాతంగి కాలనీ, కాజిపల్లిలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. 23వ డివిజన్ కార్పొరేటర్ బెంద్రం సునీత రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య, 36వ డివిజన్ అధ్యక్షుడు రంజిత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళల సంక్షేమం, ఆత్మగౌరవం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మనాలి ఠాకూర్ తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డ వివాహానికి దాతల చేయూత



**దివ్యకు పుస్తెమట్టెలు, మంచాలు, పరుపులు అందజేత**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం) :**

నిరుపేద కుటుంబానికి చెందిన కల్లెడ దివ్య వివాహానికి దాతలు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు అండగా నిలుస్తున్నారు. ఆగస్టు 26న దివ్య వివాహాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో మారేడుపాకకు చెందిన కందుల స్వప్న--లింగయ్య దంపతులు, వారి పిల్లలు అభిలాష్, శ్రీహర్ష ఆధ్వర్యంలో పుస్తెమట్టెలు, మంచాలు, పరుపులు, ఇతర సామగ్రిని దివ్యకు అందజేశారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబానికి చెందిన దివ్య వివాహానికి సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక నిర్వాహకులు మద్దెల దినేష్, గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ దివ్య వివాహానికి మానవతా దృక్పథంతో దాతలు తమవంతు సహాయం అందించాలని కోరారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలు ఆర్థిక భారంగా మారకుండా అండగా నిలవడమే ఐక్యవేదిక లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కంది సుజాత, రవళి, ఎం.ఏ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి



**బీసీల ఓట్లతో అధికారంలోకి వస్తూ.. హక్కులపై ఎందుకు మౌనం?**
**బీసీ రాజకీయ నేతలకు ఈ విషయం ఎప్పటికి అర్థమవుతుంది?: దేవన్న**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):**

స్వాతంత్ర్యం వచ్చి 88 ఏళ్లు గడిచినా దేశంలో మెజార్టీగా ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన తగిన రిజర్వేషన్లు, ప్రాతినిధ్యం దక్కడం లేదని పూర్వ విప్లవ ఉద్యమాల మిత్రుడు దేవన్న అన్నారు. బీసీ ప్రజలు తమ ఓట్లతో కేంద్ర, రాష్ట్రాల్లో పాలకులను అందలమెక్కిస్తున్నప్పటికీ.. తమ జనాభా నిష్పత్తికి అనుగుణంగా హక్కులు సాధించుకోవాలనే చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశ జనాభాలో బీసీలు సుమారు 60 శాతం ఉన్నారని పేర్కొంటూ.. ఇంతటి పెద్ద సంఖ్యలో ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం ఎందుకు దక్కడం లేదని ప్రశ్నించారు. బీసీ రాజకీయ నాయకులు ఈ అంశంపై సమగ్రంగా ఆలోచించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు.

**పోరాటం లేకుండానే 10 శాతం రిజర్వేషన్?**

ఎలాంటి పెద్ద ప్రజా పోరాటాలు లేకుండానే అగ్రవర్ణాల ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించారని దేవన్న పేర్కొన్నారు. అదే సమయంలో దేశ జనాభాలో మెజార్టీగా ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల కోసం ఎందుకు బలమైన నిర్ణయాలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీసీల జనాభాను శాస్త్రీయంగా లెక్కించి, జనాభా నిష్పత్తికి అనుగుణంగా విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రజలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని దేవన్న పిలుపునిచ్చారు.

## గుంతలమయమైన ప్రధాన రహదారి

**మిర్యాలగూడ :** పట్టణంలోని ఈదులగూడ చౌరస్తా వద్ద ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై ఏర్పడిన భారీ గుంతల్లో కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోవడంతో గుంతలు కనిపించకుండా పోతున్నాయి. దీంతో మలుపు వద్ద ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రహదారి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది.

